తమిళనాట కూడా ఢిల్లీ ఫలితాలే

● డీఎంకేకు ఆమ్ ఆద్మీకి పట్టిన గతే
● మదురై సభలో అమిత్‌షా ధ్వజం


సభలో ప్రసంగిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

చెన్నై, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అవినీతిని ప్రోత్సహిస్తున్న డీఎంకే ప్రభుత్వానికి 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీలో ఆమ్ ఆద్మీ ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని కేంద్ర హోంమంత్రి, బీజేపీ సీనియర్ నేత అమిత్ షా పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మదురై ఒత్తకడై ప్రాంతం వేలమ్మాల్ గ్లోబల్ ఆస్పత్రి మైదానంలో జరిగిన బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో ఆయన డీఎంకే ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం అవినీతి ఊబిలో కూరుకుపోవడంతో రాష్ట్రప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నాలుగేళ్ళ డీఎంకే పాలనపై అసంతృప్తితో ఉన్న రాష్ట్రప్రజలు మార్పు కోరుకుంటున్నారని, 2026 ఎన్నికల్లో వారి కోరిక తప్పకుండా నెరవేరుతుందని అమిత్ షా జ్యోష్యం చెప్పారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పదేళ్ళలో తమిళనాడుకు అభివృద్ధి పథకాల నిమిత్తం రూ.6,80,000 కోట్లను పంపిణీ చేసిందని, గత యూపీఏ ప్రభుత్వం కేవలం రూ.1,53,000 కోట్లు మాత్రమే మంజూరు చేసిందని వివరించారు. 11 సంవత్సరాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధిచేకూరేలా పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. కేంద్రప్రభుత్వం తమిళనాడు ప్రజల అభివృద్ధి కోసం విడుదల చేస్తున్న నిధులను డీఎంకే ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్ళిస్తోందని, అలాగే కేంద్ర పథకాలకు స్టికర్లు అంటించి తమవిగా ప్రకటించుకుంటోందని ఆయన విమర్శించారు. టాస్మాక్ సంస్థలో డీఎంకే ప్రభుత్వం రూ.35,750 కోట్ల అవినీతికి పాల్పడిందని దీనికి సమాధానం స్టాలిన్ చెప్పాల్సివుందని ఆయన డిమాండ్ చేశారు. దక్షిణాది జిల్లాల్లో కుల ఘర్షణలు, దౌర్జన్యాలు, మహిళలపై వేధింపులు పెరుగుతున్నా, స్టాలిన్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమిళ ప్రజలకిచ్చిన హామీల్లో ఇప్పటివరకు 10 శాతం హామీలను కూడా నెరవేర్చలేదని, దీనిపై కూడా స్టాలిన్ సమాధానం చెప్పాలన్నారు. ఒడిశా, హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిందని, 2025లో దేశ రాజధాని ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని గద్దె దింపి, 25ఏళ్ల తర్వాత మళ్ళీ బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆ రీతిలోనే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కూడా బీజేపీ- అన్నాడీఎంకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం తథ్యమన్నారు. మదురై జిల్లాలో సుబ్రమణ్యస్వామి కొలువైన తిరుప్పరంకుండ్రం కొండను డీఎంకే ప్రభుత్వం సికిందర్ కొండగా మార్చి మత చిచ్చు పెడుతోందని దుయ్యబట్టారు. తమిళమే మా ఊపిరి అని చెబుతున్న డీఎంకే ప్రభుత్వం ఉన్నత విద్యారంగంలో తమిళ మీడియం ఎందుకు ప్రవేశపెట్టలేదని ప్రశ్నించారు.

ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల కమిటీ ఇన్‌ఛార్జి అరవింద్‌మేనన్, కో-ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కేంద్ర మాజీమంత్రి పొన్ రాధాకృష్ణన్, పార్టీ మాజీ అధ్యక్షుడు అన్నామలై, ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ శ్రీనివాసన్, మాజీ గవర్నర్ తమిళిసై, హెచ్.రాజా తదితరులు పాల్గొన్నారు.


అమిత్‌షాకు వేలాయుధాన్ని కానుకగా అందజేస్తున్న పార్టీ నేతలు

డీజీపీ కార్యాలయంలో
‘డ్రెస్‌కోడ్’ తప్పనిసరి

● జీన్స్, టీషర్టుపై నిషేధం
● డీజీపీ శంకర్ జివాల్ ఆదేశం



చెన్నై, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డీజీపీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులంతా తప్పనిసరిగా డ్రెస్‌కోడ్ పాటించాలని డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులు జారీ చేశారు. డీజీపీ కార్యాలయంలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, పోలీసు ఉన్నతాధికారులు, ఆ కార్యాలయానికి ఇతర ప్రాంతాల నుండి వచ్చే ఉద్యోగులు కూడా ఈ డ్రెస్‌కోడ్ తప్పనిసరిగా పాటించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. డీజీపీ కార్యాలయంలో 190 మంది నిర్వహణా విభాగం సిబ్బంది, డీఎస్పీ ర్యాంకు నుండి సెకండరీ గ్రేట్ పోలీసుల వరకు 130 మంది పనిచేస్తున్నారు. వీరే కాకుండా వివిధ ప్రత్యేక విభాగాల్లో ఉద్యోగులున్నారు. వీరిలో చాలా మంది టీషర్టు, జీన్స్ ధరించి రావడం, పలువురు గడ్డం గీయించుకోకుండానే విధులకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలోనే డీజీపీ డ్రెస్‌కోడ్‌ను నిర్బంధం చేశారు. ఇకపై కానిస్టేబుళ్లు, ఇతర ఉద్యోగులు కాలర్ కలిగిన ఇస్త్రీ చేసిన చొక్కాలు, సాధారణ ఫ్యాంట్, కాళ్ళకు బూట్లు ధరించాలని తెలిపారు. మహిళా కానిస్టేబుళ్లు, ఉద్యోగినులు పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచేలా వస్త్రధారణ ఉండాలన్నారు. ఇక కానిస్టేబుళ్లు, ఉద్యోగులు తప్పకుండా షేవింగ్ చేసుకునే డ్యూటీకి రావాలన్నారు. ఉన్నతాధికారి అనుమతి లేకుండా ఎవరూ గడ్డం గీయించుకోకుండా విధులకు హాజరుకాకూడదని, అలా వస్తే క్రమశిక్షణా రాహిత్యంగా పరిగణించాల్సి వస్తుందని శంకర్ జివాల్ ఆ ఉత్తర్వులో హెచ్చరించారు.

పునర్విభజనలో సీట్లు తగ్గవని
హామీ ఇవ్వగలరా?

● అమిత్‌షాను ప్రశ్నించిన డీఎంకే ఎంపీలు

ప్యారీస్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పునర్విభజనలో తమిళనాడులో సీట్లు తగ్గవని హామీ ఇవ్వగలరా? అని కేంద్రమంత్రి అమిత్‌షాను డీఎంకే ఎంపీలు తమిళచ్చి తంగ పాండ్యన్, దయానిధి మారన్ ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా శని,ఆదివారాల్లో మదురైలో పర్యటించిన సందర్భంగా డీఎంకే ఎంపీలు ఈ మేరకు ప్రశ్నలు లేవనెత్తారు. తమిళనాడులో నియోజకవర్గాల సంఖ్య తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం పునర్విభజన అంశాన్ని చేతికి తీసుకుందని డీఎంకే మండిపడింది. 84వ రాజ్యాంగంలో తీసుకొచ్చిన సవరణ ప్రకారం 2026 తర్వాత చేపట్టనున్న జన గణన జనాభా సంఖ్యను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గాల పునర్విభజన బిల్లును చేపట్టాలని డీఎంకే ఎంపీలు డిమాండ్ చేశారు.

సీఎం స్టాలిన్‌ను చూస్తే కేంద్రానికి భయం

● మంత్రి పీకే శేఖర్‌బాబు

అడయార్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను చూసి కేంద్ర ప్రభుత్వం వణికిపోతోందని దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు పేర్కొన్నారు. చూళైలోని దండు మారియమ్మన్ ఆలయ కుంభాభిషేక వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి శేఖర్‌బాబు, స్థానిక డీఎంకే నేతలు, భక్తులు భారీ సంఖ్యలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శేఖర్‌బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సుమారుగా 3 వేల ఆలయాలకు, అలాగే, 117కు పైగా మురుగన్ ఆలయాలకు కుంభాభిషేకాలు నిర్వహించామన్నారు. దేవాదాయ శాఖకు చెందిన అన్యాక్రాంతమైన 7597.77 ఎకరాల భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ద్రావిడ మోడల్ ప్రభుత్వంలో 6,306 కోట్ల విలువైన 26,300 రకాలైన అభివృద్ధి పనులు చేపట్టినట్టు వెల్లడించారు. ఇది దేవాదాయ శాఖ చరిత్రలోనే సరికొత్త రికార్డు అని పేర్కొన్నారు. కేంద్ర హోం అమిత్ షా రాష్ట్ర పర్యటనకు రావడంతో డీఎంకే ప్రభుత్వం భయపడిపోతుందంటూ వస్తున్న కామెంట్స్‌పై మంత్రి సమాధానమిస్తూ, కేంద్రాన్ని చూసి డీఎంకే భయపడటం లేదని, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను చూసి కేంద్రమే వణికిపోతోందన్నారు. బీజేపీలో భయం ఉండటం వల్లే ఆ పార్టీ పెద్దలు అప్పుడప్పుడూ రాష్ట్రానికి వచ్చి వెళ్ళే పరిస్థితి నెలకొందన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినదే నిజమైన మురుగన్ భక్తుల మహానాడు అని చెప్పారు. బీజేపీ నేతలు మదురై జిల్లా తిరుప్పరుకుండ్రంలో నిర్వహించేది పోటీ మహానాడు మాత్రమేనని అన్నారు.


చూళైలోని దండు మారియమ్మన్ ఆలయ కుంభాభిషేక వేడుకల్లో మంత్రి శేఖర్ బాబు తదితరులు

త్వరలో
స్టాలిన్ ఆరోగ్య పథకం ప్రారంభం

● రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత హెల్త్‌చెకప్‌లు ● మంత్రి సుబ్రమణ్యం


వైద్య సదుపాయాలను పరిశీలిస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం

ప్యారీస్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ‘నలంకాక్కుమ్ స్టాలిన్ దిట్టమ్’ పేరుతో కొత్త ఆరోగ్య పథకాన్ని ప్రారంభించనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం పేర్కొన్నారు. స్థానిక టి.నగర్ పాండీ బజార్ సమీపంలో కొత్తగా ఆధునిక వసతులతో నిర్మించిన ‘అట్లాంటిస్ హెల్త్‌సిటీ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి’ని ఆదివారం మంత్రి ఎం.సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 24 గంటలు పనిచేసే ఇంటర్నల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, ఎమర్జెన్సీ, గైనకాలజీ, నియోనోటాలజీ, పిల్లల వైద్యం, ల్యాప్రోస్కోపిక్, ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ విభాగాలను పరిశీలించి ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రప్రజలకు ఉచితంగా హెల్త్ చెకప్ నిర్వహించేలా కార్పొరేట్ ఆస్పత్రుల సహకారంతో త్వరలో నలంకాకూం స్టాలిన్ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రపంచంలోని పలు దేశాలనుంచి చికిత్స కోసం తమిళనాడుకు వస్తున్న విదేశీలకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అన్ని రంగాలను అభివృద్ధిపరంగా ముఖ్యమంత్రి స్టాలిన్ ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆరోగ్యశాఖ తరుపున ప్రకటించిన మేరకు రూ.13.58 కోట్లతో 1,256 ఉన్నత వైద్య శిబిరాలు ఇక నుండి ప్రతీ శనివారం నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. గ్రామాలు, గుడిసెలు అధికంగావున్నవి, ఆదిద్రావిడులు, గిరిజనులు అధికంగా నివసించే ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న ఈ శిబిరాల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ ప్రత్యేక ఉన్నత వైద్యశిబిరాలను రాష్ట్రప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా మంత్రి తెలిపారు.


ఆదివారం ఉదయం హార్బర్ నియోజకవర్గం డీఎంకే నాయకుడు టీకే శంకర్ కుమారుడు సూర్య వివాహవేడుకలకు హాజరైన ముఖ్యమంత్రి స్టాలిన్, సతీమణి దుర్గా స్టాలిన్ తదితరులు.

అకస్మాత్తుగా పెనుగాలులతో కురిసిన వర్షం


ఆవడిలో పెనుగాలులకు కూలిన గ్రీన్‌షేడ్ పందిరి

చెన్నై, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం మధ్యాహ్నం వరకూ మండుటెండకు అవస్థలుపడిన నగరవాసులు ఉన్నట్టుండి పెనుగాలులతో కురిసిన వర్షానికి ఊరట చెందారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో నగరంలో ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఆవడి, అంబత్తూరు, కోయంబేడు, అశోక్‌నగర్, వెస్ట్‌మాంబలం, వడపళని, కోడంబాక్కం, గిండి తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో అరగంటకు పైగా చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. దీనితో నగరంలో చల్లటి వాతావరణం నెలకొంది.

మా కూటమిలోకి మరిన్ని పార్టీలు

● అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిస్వామి



ప్యారీస్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే నాయకత్వం వహించే కూటమిలో మరిన్ని పార్టీలు చేరతాయని ప్రతిపక్షనేత, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. అరక్కోణం అన్నాడీఎంకే ఎమ్మెల్యే రవి ఇంటి వివాహ వేడుకల్లో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పాల్గొన్న సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 2026లో రాష్ట్ర అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో 200 స్థానాల్లో విజయం సాధిస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ చెబుతున్నారని, ఆయన కల ఫలించదని ఈపీఎస్ వ్యాఖ్యానించారు. అన్నాడీఎంకే నేతృత్వంలో ఏర్పాటైన కూటమిలో మరికొన్ని పార్టీలు చేరుతాయని, ఆ ఎన్నికల్లో ఘన విజయం సాధించి రాష్ట్రంలో మళ్ళీ మంచి పాలన తీసుకొస్తామని ఈపీఎస్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం గురించి పట్టించుకోని ముఖ్యమంత్రి స్టాలిన్ కుటుంబ పాలన సాగిస్తున్నారని, ఈ పాలనలో ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలుచేయలేదని ఆరోపించారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాం లో 11 వైద్య కళాశాలలు, ఆరు న్యాయ కళాశాలలను ప్రారంభించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన రోడ్లు, ట్రాఫిక్ రద్దీని నియంత్రించే దిశగా ఫ్లైఓవర్లను నిర్మించామని, అయితే అన్నాడీఎంకే ప్రవేశపెట్టిన మంచి పథకాలను అటకెక్కించిన ఘనత డీఎంకేకు దక్కుతుందన్నారు.

ఆడిటర్ గురుమూర్తితో మళ్లీ భేటీ
త్వరలో శుభవార్త చెబుతా

● పీఎంకే నేత రాందాస్

చెన్నై, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే)లో నెలకొన్న సంక్షోభం సమసిపోతుందని, ఈ విషయమై త్వరలో శుభవార్త తెలుపుతానని ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ తెలిపారు. అదే సమమయంలో ఆదివారం ఆడిటర్ గురుమూర్తిని కూడా కలుసుకున్నానని ఆయన ప్రకటించారు. టి.నగర్‌లోని కేంద్ర మాజీ మంత్రి ఏకే మూర్తి నివాసంలో వీరి భేటీ జరిగినట్లు తెలుస్తోంది. మీడియా సమావేశంలో ఈ విషయాన్ని రాందాస్ వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు. ఆడిటర్ గురుమూర్తి తన చిరకాల మిత్రుడని అందుకే ఆయనను కలుసుకున్నానని చెప్పారు. ప్రస్తుతం పార్టీ శ్రేణులు ఎదురు చూస్తున్న శుభవార్తను త్వరలో తానే ప్రకటిస్తానని చెప్పారు. రాజకీయాలకు వయస్సు ముఖ్యం కాదని, ఇందుకు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధే చక్కటి ఉదాహరణ అని, 95 యేళ్లపాటు ఆయన రాజకీయాలలో చక్రం తిప్పారని చెప్పారు. కొత్తగా రాజకీయపార్టీ ప్రారంభించిన విజయ్‌కి ఎప్పుడూ శుభాకాంక్షలు చెబుతూనే ఉన్నానన్నారు. వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఏ కూటమిలో చేరాలో, ఏయే పార్టీలతో పొత్తు కుదుర్చుకోవాలనే విషయాలపై మూడు నెలల తర్వాత నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. జాతీయనాయకులతో తనకు సన్నిహిత సంబంధాలున్నాయని, ప్రధాని నరేంద్రమోదీ తన చిరకాల స్నేహితుడని తెలిపారు. అమిత్‌షాను తాను కలుసుకోలేదని, రాష్ట్ర బీజేపీ నాయకులతో చర్చలు జరిపేందుకు మదురైకి వచ్చిన ఆయనకు రాందాస్ శుభాకాంక్షలు తెలిపారు.

సమాచార దర్శిని

చెన్నై సెంట్రల్ నుంచే జీటీ ఎక్స్‌ప్రెస్

● నేటినుంచి ప్రారంభం

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-న్యూఢిల్లీ మధ్య నడుపుతున్న జీటీ ఎక్స్‌ప్రెస్ సోమవారం నుంచి చెన్నై సెంట్రల్ నుంచి బయల్దేరుతుంది. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై సెంట్రల్‌లో మరమ్మతుల కారణంగా జీటీ ఎక్స్‌ప్రెస్ చెన్నై సెంట్రల్‌కు బదులు చెన్నై ఎగ్మూర్ నుంచి నడిపారు. ప్రస్తుతం చెన్నై ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో మరమ్మతుల కారణంగా జీటీ ఎక్స్‌ప్రెస్ సోమవారం సాయంత్రం 6.10 గంటలకు చెన్నై ఎగ్మూర్‌కు బదులుగా చెన్నై సెంట్రల్ నుంచి బయల్దేరుతుందని దక్షిణ రైల్వే తెలిపింది.

మూడు మండలాల్లో దివ్యాంగుల గణన

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని మూడు మండలాల్లో దివ్యాంగుల గణన చేపట్టనున్నారు. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... తమిళనాడు హక్కుల ప్రాజెక్ట్ కింద దివ్యాంగుల సంక్షేమ శాఖ ఉత్తర చెన్నై పరిధిలోని రాయపురం, తండయార్‌పేట, తిరువిక నగర్ మండలాల్లో ఇంటింటికీ వెళ్లి దివ్యాంగుల గణన గత ఫిబ్రవరి నుంచి చేపట్టారు. దివ్యాంగులను గుర్తించి, వారికి ప్రయోజనం పొందేలా అమలుచేస్తున్న పథకాలను అందజేయనున్నారు. ప్రజలు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నేడు సీఎం నేతృత్వంలో సమీక్షా సమావేశం

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో సచివాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు సమీక్షా సమావేశం జరగనుంది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ఈ సమావేశంలో రహదారులు, రిజిస్ట్రేషన్, సహకార తదితర శాఖలకు సంబంధిన పనులపై సమీక్షించనున్నారు. మంత్రులు ఏవీ వేలు, మూర్తి, చక్రపాణి, పెరియకరుప్పన్, శాఖల అధికారులు సమావేశంలో పాల్గొననున్నారు. శాసనసభలో ప్రకటించిన పథకాలు, ప్రాజెక్టుల అమలు తీరు, ప్రాధాన్యత ఇవ్వాల్సిన ప్రాజెక్టులు తదితరాలపై ముఖ్యమంత్రి సూచన చేయనున్నారని సచివాలయం తెలిపింది.

బీఎడ్, ఎంఎడ్ సెమిస్టర్ ఫలితాల విడుదల

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బీఎడ్, ఎంఎడ్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు తమిళనాడు ఉపాధ్యాయుల విద్య విశ్వవిద్యాలయ పరీక్షల ఇన్‌చార్జి కంట్రోలర్ గణేశన్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు పంపిన సర్క్యులర్‌లో.. మార్చిలో నిర్వహించిన బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్), ఎంఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశామని, కళాశాలల ప్రిన్సిపాల్స్ వారి లాగిన్, పాస్‌వర్డ్ వినియోగించి ఫలితాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

కెమికల్ ఇంజనీరింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక తరమణిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్ మొదటి, రెండవ సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈ కళాశాలలో వంద శాతం హామీతో దేశ, విదేశాల్లో అధిక జీతంతో కూడిన ఉపాధి అవకాశాలు అందించే డిప్లొమో కోర్సు అందిస్తున్నారు. డిప్లొమో ఇన్ కెమికల్ ఇంజనీరింగ్, డిప్లొమో ఇన్ పాలిమర్ టెక్నాలజీ, డిప్లొమో ఇన్ పెట్రోకెమికల్ ఇంజనీరింగ్ తదితర మూడు కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. 10వ తరగతి, తత్సమాన అర్హత కలిగిన విద్యార్థులు www.tnpoly.in అనే వెబ్‌సైట్ ద్వారా రూ.150 రిజిస్ట్రేషన్ ఫీజుతో దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు మినహాయింపు కల్పించారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఉచిత బస్‌పాస్, స్కాలర్ షిప్, పుదుమై పెన్ పథకం, ప్రగతి స్కాలర్ షిప్, తమిళ్‌పుదల్వాన్ స్కాలర్ షిప్ తదితరాలు అందించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సాంకేతిక విద్య డైరెక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది.

గ్రూప్-2 సర్టిఫికెట్ల అప్‌లోడ్‌కు అవకాశం

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసేందుకు అవకాశం కల్పించారు. ఈ విషయమై టీఎన్‌పీఎస్సీ విడుదల చేసిన ప్రకటనలో... గ్రూప్-2, 2ఏ విభాగంలో ఖాళీ పోస్టుల భర్తీకి ఉత్తీర్ణులైన పలువురు అభ్యర్థులు సర్టిఫికెట్లు సక్రమంగా అప్‌లోడ్ చేయలేదని, ఆ అభ్యర్థులకు ఈ-మెయిల్, ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం తెలిపామని, అభ్యర్థులు సర్టిఫికేట్ల అప్ లోడ్‌కు ఈ నెల 15వ తేది వరకు అవకాశం కల్పించినట్లు టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుపై శిక్షణ

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుపై మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. ఈకాట్టుతాంగళ్ సిడ్కో ఎస్టేట్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. సౌర విద్యుత్ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రాథమిక అంశాలు, ప్రాజెక్ట్ డిజైన్, ఆర్థిక ప్రణాళిక, సబ్సిడీ, వ్యాపారాభివృద్ధి సహా పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్ల పైబడిన వారు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

వినియోగదారుల భద్రతా మండలి ఏర్పాటు

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వినియోగదారుల భద్రత మండలిని పునర్నిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆహార శాఖ అధ్యక్షుడి సహా 23 మందితో కూడిన కమిటీని ప్రభుత్వం ఏర్పాటుచేసింది. వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్, తంజావూరు ఎంపీ మురసోలి సహా పలువురు ఈ మండలిలో ఉన్నారు. వినియోగదారుల భద్రతా చట్టం కింద ఏర్పాటైన ఈ మండలి వినియోగదారుల సంక్షేమానికి సంబంధించిన పనులను చేపడుతుందని ప్రభుత్వం తెలిపింది.

కున్నూర్ అడవిలో మావోయిస్టుల కోసం గాలింపు

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందా? అంటూ జిల్లా ఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక బలగాలు గాలిస్తున్నాయి. తమిళనాడు-కేరళ సరిహద్దు ప్రాంతమైన నీలగిరి జిల్లాలో మావోయిస్టులు ప్రవేశించకుండా నక్సల్ నిరోధక విభాగం ఆధ్వర్యంలో గస్తీ ముమ్మరం చేశారు. అలాగే, కున్నూర్ అటవీ ప్రాంతంలోని సెంగల్‌కొంబై సహా పలు కొండ గ్రామాల్లో నక్సల్ నిరోధక విభాగం పోలీసులు కొద్దిరోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ నిషా నేతృత్వంలో పది మంది పోలీసులు ఈ గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశించారా? ఈ ప్రాంతంలో అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరిస్తున్నారా? అంటూ గ్రామస్తులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. కొత్త వారు ఈ ప్రాంతానికి వస్తే సత్వరం పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ గ్రామస్తులను కోరారు.


గ్రామస్తులను విచారిస్తున్న ప్రత్యేక బలగాలు

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అడయార్: గాంధీ మండపం రోడ్డు, సర్దార్ పటేల్ రోడ్డు, కొట్టూరుపురం, శ్రీనగర్ కాలనీ, వెంకటాపురం, చిన్నమలై, తరమణి, ఎల్లయమ్మన్ ఆలయ వీధి, కనగం, కాళికుండ్రం, పల్లిపట్టు, శ్రీరామ్ నగర్, నెహ్రూ నగర్ 1 నుంచి 4 వీధులు, గోపి నగర్ 1 నుంచి 5వ మెయిన్ రోడ్డు, అడయార్ 6వ మెయిన్ రోడ్డు, గోవిందరాజపురం, భక్తవత్సలం నగర్ 1 నుంచి 5వ వీధులు

షోలింగనల్లూర్: వివేకానంద నగర్, ఇందిరా నగర్, నుంగంపాళయం మెయిన్ రోడ్డు, కామరాజ్ నగర్, జయ నగర్, రోజ్ గార్డన్ రోడ్డు, పెరియపాళయత్తమ్మన్ ఆలయ వీధి, పాఠశాల వీధి, సాయి గార్డన్ హిల్స్

విరుగంబాక్కం: నెహ్రూ వీధి, చేరన్ నగర్, చోళన్ నగర్, పాండియన్ వీధి, ఆళ్వార్‌తిరునగర్ జంక్షన్, ఏవీఎం అవెన్యూ మెయిన్ రోడ్డు, ఆర్కాడు రోడ్డు, కామరాజర్ రోడ్డు, నారాయణస్వామి రోడ్డు, న్యూ కాలని, తంగల్‌ఉళవాయి వీధి

సెయింట్ థామస్ మౌంట్: రామాలయం వీధి, మౌంట్ పూందమల్లి రోడ్డు కొంత భాగం, నజరతపురం, గణపతి కాలని, వసంతం నగర్, కలైంజర్ నగర్, దండుమా నగర్, పోలీస్ క్వార్టర్స్ ఏలుమలై వీధి, మీనాంబాక్కం కొంత భాగం, పాండియన్ వీధి, మారీసన్ 1 నుంచి 5 వీధులు, తిరువళ్లువర్ నగర్, ఎంకేఎన్ నగర్, కుమరన్ నగర్ కొంత భాగం, కుళత్తుమేడు, మాంగాళిఅమ్మన్ ఆలయ వీధి, డిఫెన్స్ కాలని, బర్మా కాలని, కారియార్ ఆలయ వీధి, నార్త్ పెరేడ్ రోడ్డు, ఇందిరా నగర్, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమి, నేవీ క్వార్టర్స్, వుడ్‌గ్రీక్ రోడ్డు, తులసింగపురం, మరియాపురం, మదియాస్ నగర్, యూరోపియన్ లైన్, బజార్ రోడ్డు, మేట్టు వీధి, ఆర్కాడు పేట

పోరూర్: ఆర్ఈ నగర్, కావనూరు, సిరుగళత్తూర్, నందవనం నగర్, నాయుడు వీధి, మణిమంగళం రోడ్డు, కెలిద్‌పేట, దేవి కరుమారిఅమ్మన్ నగర్, నందంబాక్కం కొంత భాగం, అయ్యన్ నగర్, బిగ్ కాలని

బోగీలో పనిచేయని ఏసీ

రైలు నిలిపివేసి ప్రయాణికుల ఆందోళన

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలో ఏసీ పనిచేయకపోవడంతో ప్రయాణికులు రైలును నిలిపివేసి ఆందోళన చేపట్టారు. చెన్నై సెంట్రల్-తిరువనంతపురం ఎక్స్‌ప్రెస్ రైలు (నెం.12 695) శనివారం మధ్యాహ్నం 3.20 గంటలకు చెన్నై సెంట్రల్ నుంచి బయల్దేరింది. రైలులోని ఫస్ట్ క్లాస్ ఏసీ బోగీలో ఏసీ పనిచేయకపోవడంతో ప్రయాణికులు టిక్కెట్ కలెక్టర్, ఆన్‌లైన్ ద్వారా రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. సాయంత్రం 6.28 గంటలకు రైలు జోలార్‌పేట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న సమయంలో, అప్పటికే సిద్ధంగా ఉన్న మెకానిక్ మరమ్మతులు చేపట్టడంతో 20 నిమిషాలు ఆలస్యంగా రైలు బయల్దేరింది. రైలు బయల్దేరిన కొద్దిసేపటికే ఏసీ పనిచేయడం లేదని గుర్తించిన ప్రయాణికులు జోలార్‌పేట-సేలం మధ్య ఎమర్జెన్సీ చైన్ లాగి రైలు నిలిపివేసి రైలింజన్‌కు అడ్డుగా నిలబడి ఆందోళన చేపట్టారు. టీటీలు, ఆర్పీఎఫ్ పోలీసులు ప్రయాణికులతో చర్చలు జరిపి సేలం స్టేషన్‌లో మరమ్మతులు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించగా, రైలు సేలం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది.

అయితే అక్కడ మరమ్మతులు చేపట్టినా ఫలితం లేకపోవడంతో, అధికారులు ప్రయాణికులకు నచ్చచెప్పి టూ టైర్ ఏసీ బోగీలోకి వారిని పంపించడంతో రైలు బయల్దేరి వెళ్లింది.

వైద్యుడి ప్రాణం తీసిన ఆన్‌లైన్ రమ్మీ

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీలో లక్షలు పోగొట్టుకున్న వైద్యుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దిండుగల్ జిల్లా వడచందూర్ వసంత నగర్‌కు చెందిన జయరాజ్-బెస్కిలాల్ దంపతుల కుమారుడు జాషువా సామురాజ్ (29) దిండుగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యుడుగా పనిచేస్తూ, సేలంలోని ఓ ప్రైవేటు వైద్యకళాశాలలో అనస్థీషియాలజీ విభాగంలో పీజీ చదువుతున్నాడు. ఈ క్రమంలో, ఆన్‌లైన్ రమ్మీకి బానిసైన సామురాజ్, సుమారు రూ.7 లక్షల వరకు కోల్పోయినట్లు తెలిసింది. చదువు కోసమని తల్లిదండ్రులు, బంధువుల నుంచి తీసుకున్న నగదు ఆన్‌లైన్ రమ్మీలో పోగొట్టుకున్నాడు. డబ్బు విషయమై తల్లిదండ్రులు నిలదీయడంతో మనస్తాపం చెందిన సామురాజ్, ఈ నెల 2వ తేది తాను ఆత్మహత్య చేసుకోబోతున్నానని లేఖ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దిగ్భ్రాంతి చెందిన తల్లిదండ్రులు వడచందూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో, కొడైకెనాల్ పుంపారై కొండ గ్రామం సమీపంలో ఓ కారు కొద్దిరోజులుగా నిలిచి ఉందని ఆ ప్రాంత ప్రజలు శనివారం కొడైకెనాల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు వెళ్లి కారులో పరిశీలించగా, అందులో ఓ యువకుడు తనకు తానుగా విషం తీసుకుని మృతిచెందినట్లు గుర్తించారు. అలాగే, కొద్దిరోజుల క్రితం అదృశ్యమైన జాషువా సామురాజ్‌గా గుర్తించారు. మృతదేహాన్ని కొడైకెనాల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.


జాషువా సామురాజ్ (ఫైల్ ఫొటో)

అఖిల భారత క్షత్రియ మహాసభ సమావేశం


అఖిల భారత క్షత్రియ మహాసభ నిర్వాహకులు

వేలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని విరించిపురంలో అఖిల భారత క్షత్రియ మహాసభ జరిగింది. క్షత్రియ సంఘ జిల్లా అధ్యక్షులు రాజేంద్ర వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని క్షత్రియ సంఘాల కంటే మెరుగ్గా వేలూరు జిల్లా క్షత్రియ మహాసభ నడుస్తోందన్నారు. విద్య, వైద్య, పారిశ్రామిక తదితర రంగాల్లో క్షత్రియులు గొప్పగా రాణిస్తున్నారన్నారు. త్వరలో సంఘంలోని నిరుపేద పిల్లల చదువులు, వారికి ఉద్యోగావకాశాలు కల్పించి సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గుణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణపతి, జిల్లా కార్యదర్శి మోహన్ రాజు, కోశాధికారి వినోద్ ఖన్నా సహా పలు జిల్లాల క్షత్రియ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన వంట నూనె లారీ

● బిందెలతో ఆయిల్ తీసుకెళ్లిన ప్రజలు



పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వంట నూనె లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదానికి గురైంది. తిరుప్పూర్ జిల్లా తారాపురం నుంచి మహారాష్ట్రకు 10వేల లీటర్ల వంట నూనె లోడుతో లారీ బయల్దేరింది. నామక్కల్-సేలం జాతీయ రహదారిపై వెళ్తున్న లారీని వెనుకగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో లారీ వెనుక వైపున పగుళ్లు ఏర్పడి నూనె లీకయింది. విషయం తెలిసిన చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు బిందెలతో వెళ్లి నూనె నింపుకుని వెళ్లారు. సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న పోలీసులు, ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం వివరాలు సేకరిస్తున్నారు. కాగా, ప్రమాదానికి గురైన ట్యాంకర్ లారీలోని నూనె శుద్ధి చేయలేదని, వంటకు పనికి రాదని, ప్రజలు ఈ విషయమై అప్రమత్తంగా ఉండాలని నామక్కల్ ఎస్పీ రాజేష్‌కన్నన్ విజ్ఞప్తి చేశారు.

రూ.2కోట్ల గంజాయి స్వాధీనం

● ఆరుగురి అరెస్ట్

ప్యారీస్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరం నుంచి సముద్ర మార్గం గుండా పడవలో అక్రమంగా శ్రీలంకకు తరలించేందుకు యత్నించిన రూ.2 కోట్ల విలువైన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రామేశ్వరం సముద్రతీరం నుంచి ధనుష్కోటి మీదుగా శ్రీలంకకు సీహార్స్, బీడీ ఆకు, యాలకులు, పసుపు తదితరాలను పడవల్లో తరలిస్తుంటారు. ఈ నేపథ్యంలో, రామేశ్వరం నుంచి శ్రీలంకకు గంజాయి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రత్యేక విభాగం ఎస్ఐ వడివేలు నేతృత్వంలో రామేశ్వరం సముద్రతీరంలో నిఘా వేసిన పోలీసులు అక్కడ నిలిపివున్న కారులో నుంచి పార్శిల్ ప్యాకెట్లను పడవలోకి ఎక్కించే ప్రయత్నంలో వున్న వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. అయితే వారిని పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వారి దగ్గరున్న 25 పార్శిల్ ప్యాకెట్లను తనిఖీ చేసి వాటిలోవున్న రూ.2కోట్లు విలువ చేసే 50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి రామేశ్వరం, తంగచ్చి మఠానికి చెందిన సహాయరాజ్ (34), రామచంద్రన్ (26), కులోత్తమన్ (30), సంతోష్ (37) సత్యం (27) అర్తినాస్ (41) అనే ఆరుగురిని అరెస్టు చేసి విచారణ ప్రారంభించారు.

దుబాయ్ విమానంలో సాంకేతిక లోపం

● ప్రయాణికుల అవస్థలు

అడయార్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మీనాంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్‌కు బయలుదేరిన విమానం రన్ వేపైకి వెళ్ళిన తర్వాత సాంకేతిక లోపం తలెత్తింది. ఈ కారణంగా తీవ్ర జాప్యం జరగడంతో 312 మంది ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి ఆదివారం ఉదయం 9.50 గంటలకు 312 మంది ప్రయాణికులు, 14 మంది సిబ్బందితో దుబాయ్‌కు బయలుదేరింది. ఈ విమానం గాల్లోకి ఎగిరేందుకు టాక్సీ వే డీ-1కు బయలుదేరింది. ఆ సమయంలో సాంకేతిక లోపం ఉన్నట్టు పైలెట్లు గుర్తించారు. దీంతో ఆ విమానాన్ని టాక్సీ వేలోనే నిలిపి, కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత ఆ విమానంలోని సాంకేతిక లోపాన్ని సరిచేశారు. దీంతో కొన్ని గంటల పాటు ఆలస్యం కావడంతో విమానంలోని ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

తిరుత్తణి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి నగరంలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆదివారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రతాప్ ఆదేశాల మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో భోజనం హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్, టీ కేఫ్‌లు తదితర దుకాణాల్లోని ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కొన్ని హోటళ్లలో విక్రయిస్తున్న చికెన్, మటన్ కూరల్లో రసాయన మిశ్రమాలు కలిసినట్లు గుర్తించి ఆ ఆహారాన్ని స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాదేవి మాట్లాడుతూ, శనివారం తిరుత్తణిలో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న సురేందర్ కుమారుడు భరత్ (13) చికెన్‌రైస్ తిని మృతిచెందిన నేపథ్యంలో ఈ తనిఖీలు చేస్తున్నామని, అదేవిధంగా మురుగన్ ఆలయానికి వచ్చే భక్తులకు నాణ్యతలేని రసాయనిక ఆహారాన్ని అందజేస్తున్న హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం స్వాధీనం చేసుకున్న ఆహారాన్ని అధికారుల సమక్షంలో డస్ట్‌బిన్‌లో పడేశారు. హోటళ్లలోని ఆహారాల్లో నాణ్యతలోపిస్తే 9444042322 నెంబర్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని ఆమె తెలిపారు.


ఆహారాన్ని డస్ట్‌బిన్‌లో పడేస్తున్న దృశ్యం

విషవాయువు సోకి కార్మికుడి మృతి

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విషవాయువు సోకి కార్మికుడు మృతిచెందిన ఘటన తూత్తుకుడి జిల్లాలో చోటుచేసుకుంది. తిరుచెందూర్ మున్సిపాలిటీలో ఒప్పంద పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న మణి, ఆదివారం ఉదయం తోటి కార్మికులతో కలసి తిరుచెందూర్ ప్రభుత్వాసుపత్రిలో ఉన్న భూగర్భ మురుగు కాలువలో వ్యర్థాలు తొలగిస్తున్నాడు. ఆ సమయంలో మణి కాలుజారి భూగర్భ డ్రైనేజీలో పడిపోవడంతో, విషవాయువు సోకి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● టీచర్ అరెస్ట్

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన టీచర్ కటకటాలపాలయ్యాడు. సేలం జిల్లా కాకపాళయం ప్రాంతానికి చెందిన జగదీశన్ (56) ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈ పాఠశాలలో ప్లస్ 1 చదువుతున్న విద్యార్థినిపై అతడు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయమై బాలిక తల్లిదండ్రులు శనివారం సేలం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులు చేపట్టిన విచారణలో.. విద్యార్థినిపై జగదీశన్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి అతనిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

విద్యుత్ స్తంభం కూలి ఒకరి మృతి

చెన్నై, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తంజావూరు బృహదీశ్వరాలయం వద్ద ఆదివారం ఉదయం విద్యుత్ స్తంభం కూలిపడటంతో ఒకరు మృతి చెందారు. ఆ ఆలయం సమీపంలోని కొబ్బరిబొండాల దుకాణం వద్దనున్న విద్యుత్ స్తంభం ఉన్నట్టుండి కూలి ఆ దుకాణం వద్ద నిలిచి ఉన్న సుబ్రమణియన్ అనే వ్యక్తిపై పడింది. ఈ దుర్ఘటనలో తీవ్రమైన గాయాలు తగులటంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

కుండ్రత్తూరు మురుగన్ ఆలయంలో ఒకే రోజు 57 జంటలకు వివాహాలు

అడయార్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుండ్రత్తూరులోని మురుగన్ ఆలయంలో ఒకే రోజు 57 జంటలు వివాహం చేసుకున్నారు. ఆదివారం శుభముహూర్తం కావడంతో ఈ ఆలయంలో అనేక మంది పెళ్ళిళ్ళు చేసుకున్నారు. దీంతో ఆలయంలో రద్దీ నెలకొంది. దీనికితోడు ఆదివారం సెలవు తోడవడంతో భక్తులు కూడా స్వామి దర్శనం కోసం అధిక సంఖ్యలో వచ్చారు. కుండ్రత్తూరు మురుగన్ ఆలయానికి వెళ్ళే మార్గంలో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు... ఆలయం వద్దకు చేరుకుని, వాహనాలను క్రమబద్ధీకరించారు.

మనవడి పెళ్లికి పిలువలేదని వృద్ధుడి ఆత్మహత్య

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మనవడి వివాహానికి తనను ఆహ్వానించలేదనే బాధతో వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెన్‌కాశి జిల్లాలో చోటుచేసుకుంది. శైలాపురం సమీపం చిన్నకుమారపట్టి ప్రాంతానికి చెందిన ఆర్ముగం (87) ఈ నెల 4వ తేది ఇంట్లో విషం తాగి స్పృహతప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఆయనను పాళయంకోట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సలు ఫలించక ఆర్ముగం శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై కడయం పోలీసులు కేసు నమోదుచేసి చేపట్టిన ప్రాథమిక విచారణలో... అరియపురంలో నివసిస్తున్న ఆర్ముగం మనవడి వివాహం ఇటీవల జరిగింది. మనవడి వివాహానికి తన కొడుకు తనను ఆహ్వానించలేదని బాధపడిన ఆర్ముగం, విషం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

వేతనాల కోసం 11న వైద్యుల పాదయాత్ర

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచాలంటూ సేలం నుంచి చెన్నై వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రభుత్వ వైద్యుల న్యాయ పోరాట కమిటీ అధ్యక్షుడు పెరుమాళ్ పిళ్లై తెలిపారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... జీవో నెం 354 అమలుచేయాలంటూ ప్రభుత్వ వైద్యులు పలురూపాల్లో ఆందోళనలు చేపడుతున్నారని తెలిపారు. విధుల్లో చేరిన తర్వాత మూలవేతనం రూ.56,100 అందించాల్సి ఉంది. కానీ, కేంద్ర ప్రభుత్వ వైద్యుడు నాలుగేళ్లలో పొందే వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వ వైద్యుడు 15 ఏళ్ల తర్వాత పొందాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కేంద్ర ప్రభుత్వ వైద్యుడు 13 ఏళ్లలో రూ.1.23 లక్షలు వేతనం పొందుతుండగా, రాష్ట్ర ప్రభుత్వ వైద్యుడికి రూ.86,000 మాత్రమే అందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ వైద్యులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వ వైద్యులకు కూడా వేతనాలు అందించాలని కోరుతూ ఈ నెల 11న సేలం మేట్టూరు నుంచి చెన్నై వరకు పాదయాత్ర చేపట్టనున్నామని, పాదయాత్రలో ప్రజలను కలుసుకొని తమ న్యాయమైన కోర్కెలు తెలిపి వారి మద్దతు కోరనున్నట్లు పెరుమాళ్ పిళ్లై తెలిపారు.

క్యాన్సర్ పరీక్షా శిబిరం ప్రారంభం


వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కలిగేలా వివిధ కార్యక్రమాలు చేపడుతోందని, ఇందులో భాగంగానే శనివారం క్యాన్సర్ బాధితులకు ఉచిత క్యాన్సర్ పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆరోగ్యశాఖ అధికారి భరణిధరన్, ముత్తయ్యన్ సహా వైద్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పది మామిడి గుజ్జు కేంద్రాలు

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 10 ప్రాంతాల్లో మామిడి గుజ్జు తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో కృష్ణగిరి, ధర్మపురి, సేలం, ఈరోడ్, వేలూరు, దిండుగల్, తేని, తిరువళ్లూర్ తదితర జిల్లాల్లో సుమారు 3.60 లక్షల ఎకరాల్లో మామిడి సాగు చేపట్టారు. ప్రతి ఏడాది సుమారు 6 లక్షల టన్నుల మామిడి కాయలు దిగుబడి వస్తోంది. ఈ ఏడాది దిగుబడులు పెరగడంతో మామిడి కాయల ధర భారీగా తగ్గింది. కోయంబేడు మార్కెట్లో మామిడి కాయలు కిలో రూ.50కి విక్రయమవుతున్నాయి. ధర తగ్గడంతో నష్టపోతున్న రైతులను ఆదుకొనేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతుల నుంచి మామిడి కాయలు కొనుగోలు చేసి ప్రైవేటు భాగస్వామ్యంతో రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రాంతాల్లో మామిడి గుజ్జు తయారీ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు ఎంపిక చేసే పనులు చేపట్టినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

మెదడు నిర్జీవమైన మహిళ అవయవాలదానం


ఉషారాణి (ఫైల్‌ఫొటో)

వేలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లా అంబూర్ కారాపట్టిలోని మారియమ్మన్ ఆలయవీధికి చెందిన ఉషారాణి (58) రోడ్డుప్రమాదానికి గురై అంబూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో, శనివారం ఉదయం ఆమె మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు గుర్తించారు. వైద్యుల సూచనలతో ఆమె అవయవాలు దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో ఆదివారం ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా కొన్ని అవయవాలను తీసిన వైద్యులు, వాటిని పలు ఆసుపత్రులకు పంపించారు. అనంతరం ఉషారాణి మృతదేహానికి ఆస్పత్రి వైద్యులు నివాళులర్పించారు.

డ్యూటీ చేస్తూ గుండెపోటుతో కండక్టర్ మృతి

పెరంబూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న కండక్టర్ గుండెపోటుతో మృతిచెందాడు. తిరుచ్చి నుంచి కాంచీపురానికి శనివారం రాత్రి ప్రభుత్వ బస్సు బయల్దేరింది. ఈ బస్సు కండక్టర్‌గా మోహన్ (56) వ్యవహరిస్తున్నాడు. కడలూరు జిల్లా తోళతూర్ ప్రాంతంలో బస్సు వస్తుండగా, హఠాత్తుగా మోహన్ స్పృహతప్పి పడిపోయాడు. డ్రైవర్ వెంటనే బస్సును సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మోహన్‌ను పరీక్షించిన వైద్యులు, అతను గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిపారు.

కుక్కర్ పేలి ఇద్దరికి గాయాలు

అడయార్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని ఓ దుకాణంలో కుక్కర్ పేలడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దరూ ప్రాణాపాయస్థితిలో ఉండటంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సౌత్ ఉస్మాన్ రోడ్డులో గత పదేళ్ళకుపైగా ముబారక్ (34) అనే వ్యక్తి స్నాక్స్ దుకాణం నడుపుతున్నాడు. శనివారం సాయంత్రం ఎప్పటిలాగే కుక్కర్‌లో మంసాన్ని ఉడకబెడుతుండగా ఒక్కసారిగా అది పేలిపోయింది. ఆ సమయంలో దుకాణంలో ఉన్న అఫ్జల్ (35), ముబారక్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కీల్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

గర్భస్థ శిశువుకు లింగ నిర్ధారణ..ఇద్దరి అరెస్టు

అడయార్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా ఆత్తూరు సమీపంలో గర్భస్థ శిశువుకు లింగ నిర్ధారణ చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఆత్తూరు సమీపంలోని వడకపుత్తూరులో ఇద్దరు యువకులు లింగ నిర్ధారణ చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. ఇద్దరు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని కుల్లనాయకనూరు ప్రాంతానికి చెందిన ప్రశాంత్, కల్లకుర్చి జిల్లాకు చెందిన మణివణ్ణన్‌గా గుర్తించారు. వీరిద్దరూ స్కానింగ్ యంత్రంతో తమను సంప్రదించే గర్భిణులకు లింగ నిర్ధారణ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్టు గుర్తించారు. అలా ఇప్పటివరకు 20 మందికి లింగ నిర్ధారణ చేసినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది.

27న ఇంజనీరింగ్ ర్యాంకుల జాబితా

ప్యారీస్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయం పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 463 ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి. వీటిలో 2025-2026వ విద్యాసంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ గత నెల 7న ఆన్‌లైన్‌లో ప్రారంభమై, శనివారం అర్ధరాత్రి 12 గంటలకు ముగిసింది. ఈ విద్యాసంవత్సరంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు 2,00374 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2,49,883 మంది ఫీజు కూడా చెల్లించారు. ఈ విద్యార్థులు సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు సోమవారం వరకు గడువు ఇచ్చారు. ఆ తర్వాత ఈ నెల 11వ తేదీ ర్యాండమ్ నెంబర్ విడుదలవుతుంది. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. 27వ తేదీ శుక్రవారం ర్యాంకుల జాబితా విడుదలచేసి, 28 నుంచి జూలై 2వ తేదీ వరకు ఇంజనీరింగ్ అడ్మిషన్లకు సంబంధించిన వివరాలను అన్నా విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. ఈ అడ్మిషన్లకు సంబంధించిన వివరాలను త్వరలో విడుదల చేయనున్నట్లు అన్నావిశ్వవిద్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.



'తిరుక్కురళ్' ఆడియో రిలీజ్ దృశ్యం

'తిరుక్కురల్' మానవాళికే పంచమవేదం

● తిరుమావళవన్

సమస్త మానవాళికి 'తిరుక్కురళ్' పంచమవేదం వంటిందని డీపీఐ ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్ అన్నారు. పెరుంతలైవర్ కామరాజ్ బయోపిక్‌ను 'కామరాజ్' పేరుతో నిర్మించిన రమణ కమ్యూనికేషన్స్ తాజాగా 'తిరుక్కురళ్' పేరుతో ఓ చిత్రాన్ని నిర్మించింది. ఏ.జె.బాలకృష్ణన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదలకానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ ఫంక్షన్ ఏర్పాటైంది. ఈ వేడుకల్లో డీపీఐ ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్‌తో సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొని ఆడియో రిలీజ్ చేశారు. సభలో తిరుమావళవన్ మాట్లాడుతూ, 'తమిళం నుంచే కన్నడ భాష పుట్టిందంటూ కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలపై పెను దుమారం చెలరేగిందని, ఆ అభిప్రాయాన్ని కన్నడిగులు అంగీకరించలేకపోయినా, ఆయన చేసిన వ్యాఖ్యల్లో ఏమాత్రం తప్పులేదన్నారు. ఎంతో మంది బ్రిటీష్ పాలకులు, ప్రముఖులు తమిళం నేర్చుకుని, ఆ భాషపై అధ్యయనం చేశారని, ప్రాచీన తమిళ పండితులతో పరిశోధన కూడా చేశారని, తమిళం అన్ని భాషలకు మూలం అని ధృవీకరించారని చెప్పారు. ఈ ఆధునిక యుగంలోనూ తమిళం కంప్యూటరీకరణకు అనుగుణంగా తనను తాను మార్చుకుంటోందని చెప్పారు. ఇంతటి కీర్తి సంతరించుకున్న తమిళ భాషలో ఉన్న తిరుక్కురల్ యావత్ మానవాళికే పంచమవేదం వంటిది' అని ఆయన పేర్కొన్నారు. ఆ తర్వాత చిత్ర దర్శకుడు ఏజే బాలకృష్ణన్, నిర్మాత, దర్శకుడు, రచయిత వి.శేఖర్, దర్శకుడు సుబ్రహ్మణ్య శివ, చిత్ర బృందం సభ్యులు ప్రసంగించారు.

కార్తీ 'సర్దార్-2' చిత్రీకరణ పూర్తి

చిత్రజ్యోతి

పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తీ హీరోగా, ద్విపాత్రాభినయం చేస్తున్న చిత్రం 'సర్దార్-2'. గతంలో వచ్చిన 'సర్దార్'కు సీక్వెల్‌గా రూపొందిస్తున్నారు. రెండో భాగంలో కార్తి సరసన మాళవికా మోహనన్, ఆషికా రంగనాథన్, రజీషా విజయన్ నటించారు. విలన్‌గా ఎస్‌జే సూర్య, ఓ ముఖ్య పాత్రలో హాస్య నటుడు యోగి బాబు నటించారు. చెన్నై, మైసూరుతో పాటు విదేశాల్లో షూటింగ్ జరుపుకోగా, ఈ చిత్రీకరణ పనులు శనివారం పూర్తయ్యాయి. దీంతో యూనిట్ సభ్యులతో కలిసి హీరో, హీరోయిన్, దర్శక నిర్మాతలు కేక్ కటింగ్ వేడుకల్లో పాల్గొన్నారు. ఆ వేడుకల ఫొటోను చిత్ర బృందం సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇకపై పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత ఎస్.లక్ష్మణ్ కుమార్ నిర్మించారు.



కేక్ కట్టింగ్ చేసి చిత్ర బృందం సంబరాలు

జపాన్‌లో ధనుష్ సినిమా షూటింగ్

ధనుష్ - మారి సెల్వరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా షూటింగ్ జపాన్‌లో జరుగుతోంది.. వీరిద్దరి కాంబోలో 2021లో 'కర్ణన్' అనే చిత్రం ఘన విజయం సాధించింది. ప్రస్తుతం ఈ చిత్రం కూడా విజయం సాధిస్తుందని నిర్మాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రం ధనుష్‌కు 56వ చిత్రం. ప్రముఖ నిర్మాత డాక్టర్ కె.గణేష్ వేల్స్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఇదిలా వుంటే, ప్రస్తుతం మారి సెల్వరాజ్ 'బైసన్' అనే చిత్రాన్ని రూపొందించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుపుకుంటోంది. ఇంతలోనే ధనుష్ ప్రాజెక్టుపై ఆయన దృష్టిసారించారు. ఈ సినిమా షూటింగ్ జపాన్‌లో చేపట్టారు. ఈ ప్రాజెక్టును ఏడు నెలల్లో పూర్తి చేయనున్నారు.



ఎస్కే సరసన ఇద్దరు భామలు



కళ్యాణి ప్రియదర్శిని

హీరో శివకార్తికేయన్ సరసన ఇద్దరు హీరోయిన్లు నటించనున్నారు. వెంకట్ ప్రభు దర్శకత్వంలో రూపొందనున్న సినిమాలో కళ్యాణి ప్రియదర్శిని, కయదు లోహర్‌లను ఎంపిక చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. కాగా, 'ది గోట్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ మూవీ తర్వాత వెంకట్ ప్రభు తన తదుపరి చిత్రాన్ని శివకార్తికేయన్‌తో తీస్తున్నారు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు ఎపుడో ప్రారంభంకావాల్సివుంది. కానీ, శివకార్తికేయన్ క్యాల్షీట్ల సమస్య కారణంగా జాప్యం జరిగింది. అయితే, ఇపుడు పరిస్థితులు అనుకూలించడంతో ప్రాజెక్టుపై దృష్టిసారించారు. ఇందులోభాగంగా, హీరోయిన్ల, ఇతర నటీనటుల ఎంపికపై దృష్టిసారించారు. టైమ్ ట్రావెల్ సైన్స్ ఫిక్షన్‌లో జోనర్‌లో రూపొందించారు.



కయదు లోహర్



నాళికినరు ప్రాంతం నుండి ఆలయానికి వెళుతున్న భక్తులు

తిరుచెందూరులో నేడు వైకాశి విశాఖ ఉత్సవాలు

● ఆలయానికి పోటెత్తిన భక్తులు

టి.నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో ప్రథమ క్షేత్రంగా పేరుగడించిన తిరుచెందూరు సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో సోమవారం వైకాశి విశాఖ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుండి వేలాదిమంది భక్తులు తరలిరావటంతో తిరుచెందూరు ప్రాంతం పూర్తిగా జనంతో నిండిపోయింది. వైకాశి విశాఖ ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒంటిగంటకే ఆలయాన్ని తెరచి, విశ్వరూపదర్శనం, ఉదయం 6 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, 10 గంటలకు ఉచ్చికాల దీపారాధన, సాయంత్రం నాలుగు గంటలకు సాయం సంధ్యా దీపారాధన నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో మునికుమారులకు శాపవిమోచనం కలిగించే ఘట్టాన్ని ప్రదర్శించనున్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు గత రెండు రోజులుగా భక్తులు వేల సంఖ్యలో రావటంతో ఆలయం వద్ద, సముద్రతీరం వద్ద, నాళికినరు వద్ద రద్దీ అధికమైంది. భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు ఆరోగ్యశిబిరాలు చేశారు. భక్తులకు ఎండవేడి తగులకుండా గుడారాలను నిర్మించారు. ఆలయ సమాచార కేంద్రం, నాళికినరు ప్రాంతం, రథమండప ప్రాంతం వద్ద ఫైరింజన్లతో అగ్నిమాపక దళం సభ్యులను సిద్ధంగా ఉంచారు.



తిరుచెందూరు వెళ్తున్న పాదయాత్ర భక్తులు

పాదయాత్ర భక్తులు...

వైకాశి విశాఖ ఉత్సవాల్లో పాల్గొనేందుకు తూత్తుకుడి తదితర ప్రాంతాల నుండి వచ్చే పాదయాత్ర భక్తులకు కూడా ఆలయ నిర్వాహకులు సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ పాదయాత్ర భక్తులకు ఆలయ నిర్వాహకులు చేతికి గుర్తింపు కంకణాలను కట్టారు. ఆదివారం ఉదయం ఎనిమిది నుండి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు ఆరుముగనేరి డీసీ, డబ్ల్యూ బస్‌స్టాప్ వద్ద పాదయాత్ర భక్తులకు ఈ కంకణాలు కడుతున్నారు. వీరికి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్‌లో స్వామివారిని నిమిషాలలో దర్శనం చేసుకునే సుదపాయం కల్పిస్తున్నారు. ఆలయ తక్కర్ అరుళ్ మురుగన్, ఆలయ డిప్యూటీ కమిషనర్ జ్ఞానశేఖరన్ ఈ ఏర్పాట్లు చేపడుతున్నారు.

నేత్రపర్వంగా సీతా కల్యాణం

ప్యారీస్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరు పటేల్ రోడ్డు ఆనంద నిలయంలోని వేంకటేశ్వర భక్త సమాజం ఆధ్వర్యంలో ఆదివారం సీతా కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఈ సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుండి ప్రారంభమైన వసంతోత్సవాల్లో ముగింపు కార్యక్రమంగా సీతారాముల కల్యాణ వైభవాన్ని ఆనంద్ భాగవతార్ బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు భజనగీతాల ఆలాపన, సాయంత్రం పవలింపు సేవల సందర్భంగా స్వాగత సత్సంఘం వారిచే నామసంకీర్తనం జరిగింది. ఆనంద నిలయం 28వ వార్షిక నిర్మాణదినం సందర్భంగా సమాజం ఆధ్వర్యంలో మహాగణపతి హోమంతో ఈ నెల 6న ప్రారంభమైన వసంతోత్సవాల్లో ప్రముఖ సంగీత దర్శకులు ఎంఆర్ సుబ్రమణ్యం, ఎస్.వసుంధర దేవి బృందం భక్తి సంగీత కార్యక్రమం వీనుల విందుగా సాగింది. 6,7 తేదీల్లో సీతా కల్యాణ వైభవంపై ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థ అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. సమాజం అధ్యక్షుడు తమ్మినేని బాబు, కార్యదర్శి ఎస్.వెంకట రామన్, జాయింట్ సెక్రటరీలు హెచ్.అనంత్‌రామన్, పి.రవికుమార్, కోశాధికారులు పి.కోదండరామయ్య, హెచ్.వెంకటరమణులు, ట్రస్టీ పి.రామచంద్రన్, కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నాలుగు రోజుల ప్రత్యేక పూజల సందర్భంగా కళాకారుల భక్తిగీతాలు, భక్తుల గోవింద, రామనామ స్మరణతో సమాజ ప్రాంగణం మారుమోగింది.



సీతా కల్యాణోత్సవంలో తమ్మినేని బాబు, కోదండరామయ్య తదితర నిర్వాహకులు



కుంభాభిషేకాన్ని తిలకిస్తున్న భక్తజనం - పాల్గొన్న ఆలయ నిర్వాహకులు

వైభవంగా తీర్థగిరి ఆలయ కుంభాభిషేకం

వేలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పుదువసూర్ సమీపంలోని తీర్థగిరి మురుగన్ ఆలయ కుంభాభిషేక వేడుకలు ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన 92 అడుగుల సుబ్రహ్మణ్య స్వామి విగ్రహంపై ఆలయ అర్చకులు డ్రోన్ల సాయంతో పవిత్ర జలాలను అభిషేకించారు. అనంతరం విఘ్నేశ్వర పూజ, పూర్ణాహుతి, మహాదీపారాధన అనంతరం కుంభాభిషేక హోమం తదితర పూజలు నిర్వహించారు. మురుగన్ మూలమూర్తి సహా పరివారమూర్తులు వినాయకుడు, శివపార్వతుల సన్నిధుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే నందకుమార్, పలు సంస్థల నిర్వాహకులు సహా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తిరుత్తణి ఆలయంలో సామూహిక వివాహాలు

తిరుత్తణి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయంలో ఆదివారం ఉదయం వైకాశి మాస శుభముహూర్తం సందర్భంగా సామూహిక వివాహాలు జరిగాయి. ఈ నేపథ్యంలో, ఆదివారం తెల్లవారుజామునుండే 72 పెళ్లిజంటలకు చెందిన కుటుంబీకులు ఆలయానికి చేరుకుని పెళ్లి ఏర్పాట్లను పర్యవేక్షించారు.దీనితో ఆలయ ప్రాంగణాలు సందడిగా మారాయి. పురోహితుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా వివాహ తంతు నిర్వహించారు. అనంతరం నూతన వధూవరులు క్యూలైన్లలో వేచివుండి సుబ్రహ్మణ్య స్వామి దర్శనం చేసుకున్నారు. 72 పెళ్లిజంటలు, వారి బంధుమిత్రులతో ఆలయం కళకళలాడింది.



స్వామివారి దర్శనానికి వెళ్తున్న నూతన వధూవరులు

ఘనంగా నూకాలమ్మ ఆలయ కుంభాభిషేకం



కలశాలకు కుంభాభిషేకం చేస్తున్న అర్చకులు

తిరుత్తణి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడులోని నేదుంబరం గ్రామం నూకాలమ్మ ఆలయ కుంభాభిషేకం ఆదివారం ఉదయం ఘనంగా జరిగింది. 20ఏళ్ళ అనంతరం ఈ వేడుకలను గ్రామస్థులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గుడి ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. వేదపండితుల ఆధ్వర్యంలో అర్చకులు హోమ పూజలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు యాగపూజ, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ కలశాలను ఊరేగింపుగా ఆలయాలనికి తరలించి గోపుర కలశాలపె సంప్రోక్షించారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేశారు.



ఊరేగింపుగా కలశాలను తరలిస్తున్న నిర్వాహకులు



ఆలయంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న ప్రధానార్చకులు

మీనాక్షి అమ్మవారికి అమిత్‌షా ప్రత్యేక పూజలు

చెన్నై, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులపర్యటన నిమిత్తం మదురై నగరానికి విచ్చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆదివారం ఉదయం మీనాక్షి, సుందరేశ్వరులను దర్శించుకున్నారు. శనివారం రాత్రి ఢిల్లీ నుంచి విమానంలో మదురై చేరుకున్న అమిత్‌షా చింతామణి ప్రాంతంలోని స్టార్‌హోటల్‌లో బసచేశారు. ఆదివారం ఉదయం ఆయన భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ కారులో బయలుదేరి 11.15 గంటలకు మీనాక్షి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు.. తూర్పు రాజగోపుర ప్రవేశద్వారం గుండా వెళ్ళిన అమిత్‌షాకు ఆలయ అధికారులు, ప్రధానార్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మదురై ఆధీనం హరిహర దేశిక జ్ఞానసంబంధ పరమాచార్య స్వామి కేంద్ర హోంమంత్రికి సత్కరించి స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆలయంలో ఉచ్చికాల పూజలో అమిత్‌షా పాల్గొని మీనాక్షి సుందరేశ్వరులను దర్శించుకున్నారు. ఆ తర్వాత పొట్రామరై కుళం, వేయికాళ్ళమండపం ప్రాంతాలను సందర్శించారు. అమిత్‌షా ఆలయంలో ఉన్నంత వరకు భక్తులెవరూ ఇతర గోపుర ప్రవేశద్వారాల గుండా వెళ్ళకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. మాసి వీధి నుండి చిత్తిరై వీధి వరకూ దారి పొడవునా సాయుధ దళాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అమిత్‌షా పర్యటన సందర్భంగా మదురై విమానాశ్రయం, వీరగనూరు రింగ్‌రోడ్డు, అమ్మవారి ఆలయ ప్రాంతం, ఒత్తకడై, చింతామణి ప్రాంతాల్లో పోలీసు ఉన్నతాధికారులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పోలీసు కమిషనర్ లోకనాధన్ స్వీయ పర్యవేక్షణలో డీఎస్పీ అరవింద్ పటిష్టమైన భద్రత కల్పించారు.



అమిత్ షా నుదుట కుంకుమ బొట్టు పెడుతున్న పూజారి

స్టార్ హోటల్‌లో కేంద్ర కమిటీ సమావేశం...

ఇదిలా ఉండగా మదురై చింతామణి ప్రాంతంలో కేంద్ర మంత్రి అమిత్‌షా బస చేసిన స్టార్ హోటల్‌లో ఆదివారం మధ్యాహ్నం హఠాత్తుగా కేంద్ర కమిటీ సమావేశం నిర్వహించారు.సాధారణంగా బీజేపీ కేంద్ర కమిటీ సమావేశం కనీసం ఓ రోజంతా నిర్వహిస్తుంటారు. అయితే ఆదివారం స్టార్‌హోటల్‌లో ఆ కమిటీ సమావేశాన్ని అప్పటికప్పుడు జరిపారు.ఈ సమావేశంలో వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సమగ్రంగా చర్చించారు.ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల కమిటీ ఇన్‌ఛార్జి అరవిందమేనన్, కో- ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కేంద్ర మాజీమంత్రి పొన్ రాధాకృష్ణన్, పార్టీ మాజీ అధ్యక్షుడు అన్నామలై, ఎమ్మెల్యే వానతి శీనివాసన్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ శీనివాసన్, మాజీ గవర్నర్ తమిళిసై, కేపీ రామలింగం, కరు నాగరాజన్, కరుప్పు మురుగానందం, కాత్యాయని, పొన్ బాలగణపతి, ఏబీ మురుగానందం, కనకసభాపతి, వీపీ దురైసామి, హెచ్ రాజా సహా 22 మంది పాల్గొన్నారు. ఈ సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందే పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్ఠం చేయాలని, రాష్ట్రంలోని డీఎంకే పాలకులపై ఉన్న అవినీతి కేసులపై ప్రజల్లో ప్రచారం చేయాలని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పార్టీ శ్రేణులు ముందుండాలని చెప్పారు.ప్రస్తుతం పార్టీ గెలిచేందుకు అవకాశమున్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. రాష్ట్రంలో డీఎంకే పాలనపై అసంతృప్తితో ఉన్న ప్రజల వద్దకు వెళ్ళి బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రానికి జరిగే ప్రయోజనాలను జిల్లా నేతలు,పార్టీ నేతలు ప్రజలకు వివరించాలని అమిత్‌షా దిశా నిర్దేశం చేశారు.



మదురైలో జరిగిన బీజేపీ కేంద్ర కమిటీ నిర్వాహకుల సమావేశంలో అమిత్‌షా తదితరులు